క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు: పట్టణంలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నిరంజన్‌దాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఫీడర్ మార్పు పనులు చేపట్టడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మక్తల్: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, పెండిగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే మంజూరు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మక్తల్‌లో పరందరాములు అనే ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయడంతో అభినందన సభతో పాటు విద్యా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని పరందరాములకు ఘనంగా వీడ్కోలు పలికారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

మంత్రిని కలిసిన పీఆర్టీయూ నాయకుడు



నారాయణపేట రూరల్: మంత్రి వాకిటి శ్రీహరిని ఆదివారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు యాద్గీర్ జనార్దన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అలాగే ఈనెల 18న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న టెన్త్ విద్యార్థుల అభినందన సభలో పాల్గొనాలని ఆహ్వానించారు. అనంతరం విద్యారంగానికి సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

కల్వర్టు నిర్మించాలి



ధన్వాడ: మండల కేంద్రంలోని కంసాన్‌పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డులో మారుతీనగర్ కాలనీ వద్ద సింపునోని కాలువపై ఉన్న కల్వర్టు దెబ్బతిని ధన్వాడ నుంచి కంసాన్‌పల్లి, యంనోనిపల్లి, గున్ముక్ల, మాంత్రోనిపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న సీపీఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్ కాలనీవాసులతో కలిసి ఆదివారం ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టు స్థానంలో కొత్త దానిని నిర్మించాలని డిమాండ్ చేశారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ

నారాయణపేట: నీట్ ఫలితాల్లో పట్టణానికి చెందిన మొహమ్మద్ ఫయాజ్ కుమార్తె ఫాతిమా 574 మార్కులు, మొహమ్మద్ తాజుద్దీన్ చాంద్ కుమారుడు మొహమ్మద్ హాజీ మియా చాంద్ 418 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఆదివారం విద్యార్థులను తన కార్యాలయానికి పిలిపించుకొని శాలువా కప్పి సన్మానించి అభినందించారు. ఇద్దరికి ఫ్రీ మెడికల్ సీటు వచ్చే అవకాశం ఉందన్నారు

జింకల నుంచి పంటలను కాపాడండి

ఊట్కూరు: ఊట్కూరు మండలంలో జింకల బెడదతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రభుత్వం తగు చర్యలు తీసుకొని జింకల బెడద నుంచి కాపాడాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర నాయకులు వెంకోబా, జిల్లా కోశాధికారి పటేల్ రంగారెడ్డి, మహిపాల్‌రెడ్డిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని తిప్పరాసిపల్లి, ఓబులాపూర్, పగిడిమారి, ఊట్కూరు, తదితర గ్రామాలలో జింకల బెడద ఎక్కువగా ఉందని మొలకెత్తుతున్న మొక్కలను తినేస్తుండడంతో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం జింకలను ఇక్కడి నుంచి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు

మరికల్: భారతీయ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ అంగన్‌వాడీ కార్మిక సంఘ్ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు పెద్దపీట వేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా జాజాపూర్‌కు చెందిన ఉషారాణి, సహాయ కార్యదర్శిగా అప్పంపల్లికి చెందిన అనితను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి ఎంపిక పట్ల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు హర్షం వ్యక్తం చేశారు.

సమస్యల్లో హౌసింగ్‌బోర్డు కాలనీ

- రోడ్లు, డ్రైయినేజీలు లేక ఇబ్బందులు
- రోడ్లు ఆక్రమించి ఇష్టానుసారం ఇళ్ల నిర్మాణం
- వర్షాకాలం కావడంతో తంటాలు పడుతున్న కాలనీవాసులు



బురదమయంగా హౌసింగ్‌బోర్డు కాలనీకి వెళ్లే దారి

మాగనూర్: మాగనూర్ గ్రామంలోని హౌసింగ్ బోర్డు (పుకాట్ నగర్)కాలనీ పరిస్థితి అధ్వానంగా మారింది. 1988లో అప్పటి ప్రభుత్వం నిరుపేదల కోసం దాదాపు 10 ఎకరాలలో 207 ప్లాట్లను ఏర్పాటు చేసి గ్రామస్తులకు కేటాయించింది. అయితే మొదట అక్కడ ఇళ్లను నిర్మించుకోవడానికి ఎవరు ఆసక్తి చూపలేదు. తర్వాత అనేక మంది ఇష్టానుసారంగా ఇళ్లను నిర్మించుకున్నారు. దీంతో సీసీ రోడ్లు, డ్రైయినేజీలు వంటి కనీస వసతులు కరువయ్యాయి. వాటిని కల్పించాల్సిన పంచాయతీ అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా కాలనీ ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్లు నిర్మించుకుంటే తమ సమస్యలు దూరమవుతాయని భావించిన కాలనీ వాసులకు నిరాశే ఎదురైంది.

విష పురుగులకు నిలయం..

హౌసింగ్‌బోర్డు కాలనీలో ఖాళీ ప్రదేశాల్లో ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలకు ఆవాసంగా మారాయి. డ్రైయినేజీలు లేక మురుగునీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలం కావడంతో మరింత చిత్తడిగా మారి విష పురుగులకు నిలయంగా మారింది. దీనికి తోడు పందుల స్వైరవిహారం, దోమలు పెరగడంతో రోగాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి పారిశుద్ధ్యం నిర్వహణ, ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిల్వ ఉంకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కరువు..

కొత్తగా ఏర్పడ్డ కాలనీ కావడంతో ఇప్పటికీ ప్రధాన రోడ్డు వేయలేదు. ఇక అంతర్గత రోడ్లు, డ్రైయినేజీల నిర్మాణం ఒక్కటి కూడా జరగలేదు. తాగునీటి వసతి కూడా అంతంత మాత్రమే ఉండటంతో ఇక్కడి ప్రజలు నిత్యం ఇబ్బందుల నడుమ జీవనం సాగించాల్సి వస్తోంది. డ్రైయినేజీలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దోమల బెడద అధికమై వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలనీ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు..



జనావాసాల్లో మురుగు, పిచ్చి మొక్కలు పెరిగి విష పురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో ఖాళీ స్థలాల్లో ప్రధాన రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ మురుగు నిల్వ ఉంటుంది. డ్రైయినేజీ లేక రోడ్డుపైనే పారుతుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు దృష్టి పెట్టి కనీస వసతులు కల్పిస్తే బాగుంటుంది.

– పెద్దింటి వెంకటేష్, కాలనీ వాసి, మాగనూర్

రోడ్డు సౌకర్యం కల్పించాలి..



గతంలో ప్రధాన రహదారి నుంచి హౌసింగ్‌బోర్డు కాలనీకి ప్రభుత్వం చక్కని రోడ్డు సౌకర్యం కల్పించింది. అయితే కొందరు ఇష్టానుసారంగా ఇళ్లను నిర్మించుకోవడంతో ప్రస్తుతం సరైన రోడ్డు సౌకర్యం లేక కాలనీ వాసుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యంతో పాటు మౌలిక వసతులు కల్పించాలి.

– పుంజనూరు వంశీ, మాగనూర్

త్వరలోనే పనులు చేపడతాం



మండల కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించాం. పెద్ద సంఖ్యలో నిధులు అవసరమవడంతో ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రహ్మతుద్దీన్, ఎంపీడీవో, మాగనూర్

మోదీ నేతృత్వంలో బలమైన శక్తిగా భారత్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సంజీవ్ గౌడ్

దామరగిద్ద: మోదీ పాలనలో దేశం బలమైన శక్తిగా ఎదిగిందని మండల బీజేపీ నాయకులు అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీజేపీ మండల కార్యశాల కార్యక్రమంలో జిలా అధికారి ప్రతినిధి వెంకటయ్య, మండల ప్రభారి సాయిబన్న, మండల అధ్యక్షుడు సంజీవ్‌గౌడ్, జిల్లా కార్యదర్శి గోపాల్ రావ్‌లు మాట్లాడుతూ 11 ఏళ్ల బీజేపీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందన్నారు. అలాగే ప్రధాని మోదీ పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తూ ప్రవేశపెట్టిన కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరవేయాలని, రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటయ్య, సురపురం వెంకటయ్య, అబ్దుల్ నబీ, సాయిలు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయండి

మాగనూర్: కేంద్ర ప్రభుత్వం పథకాలను ప్రతి ఇంటికి చేరవేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వడ్వాట్ గ్రామంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్ని మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికలో బీజేపీ భారీ సంఖ్యలో సీట్లు గెలిచేలా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లి బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంశేఖర్ గౌడ్, నర్సప్ప, కనకరాజు, వాకిటి మల్లేష్, నారాయణ, శ్రీనివాసులు, తిమ్మప్ప పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



దామరగిద్ద: మండలంలోని గడిముష్కపల్లి గ్రామానికి చెందిన బీఆఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సాయిబన్న ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి సాయిబన్న ఇంటికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ పరంగా కుటుంబాన్ని ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నర్సప్ప, వెంకట్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సుభాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ధన్వాడ: ధన్వాడ మండలంలోని చర్లపల్లిలో విద్యుత్ ప్రమాదంలో చనిపోయిన కార్యకర్త కరుణాకర్‌రెడ్డి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. తమ పార్టీ ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటుందని, ఎలాంటి అవసరం ఉన్న తనను నిర్భయంగా కలవొచ్చని హామీ ఇచ్చారు.

ఘనంగా కేంద్రమంత్రి జన్మదిన వేడుకలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

మక్తల్: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు , కేంద్ర మంత్రి గంగపురం కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలను మక్తల్‌లోని శ్రీపడమటి ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి శంకరొళ్ల రవికుమార్‌తో పాటు కార్యకర్తలు ఆలయంలో కిషన్ రెడ్డి పేరిటా ప్రత్యేక పూజలు జరిపించారు. భవిష్యత్తులో ఈలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని కోరుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు సోంశేఖర్‌గౌడ్, జిల్లా కార్యదర్శి నాగప్ప, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావని, మల్లికార్జున్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ఏర్పాటు చేయాలి

మక్తల్: మక్తల్ మండలం పారేవుల గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు ఆదివారం మంత్రి వాకిటి శ్రీహరిని హైదరాబాద్‌లోని ఆయన చాంబర్‌లో కలుసుకొని వినతిపత్రం అందజేశారు. ప్రధానంగా అంగన్‌వాడీ భవనం లేక పిల్లలు ఇబ్బదులు పడుతున్నారన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించారు. త్వరలో నిధులు మంజూరు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో గోవింద్, ఆనంద్, హరికృష్ణ, అశోక్, తిరుమలేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

నారాయణపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు నష్టం కలిగించే విధానాలను అవలంభిస్తున్నాయని, కార్మికులు ఐక్యంగా ఉద్యమించి వాటికి అడ్డుకట్ట వేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో జరుగుతున్న జిల్లా స్థాయి ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులకు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న నాలుగు కోడ్‌లతో కార్మికులకు కలిగే నష్టాలను వివరించారు. కార్మిక వర్గం పోరాడు సాధించుకున్న 8 గంటల పని దినాన్ని ప్రధాని మోదీ ప్రభుత్వం 12 గంటలకు పెంచి శ్రామికుల శ్రమను దోపిడీ చేసేందుకు కార్పొరేట్ సంస్థలకు అవకాశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. కేంద్రం తీరుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మె చేపట్టామని, సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి బలరాం, నాయకులు ఆంజనేయులు, గోవిందరాజు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణ కమిటీ ఎన్నిక

నారాయణపేట రూరల్: బీజేపీ నారాయణపేట పట్టణ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శులుగా దత్తు, సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ రెడ్డి, విశాలాక్షి, హనుమంత్ రావు, చలపతి, సహ కార్యదర్శులుగా బాబు, జయశ్రీ, విజయ, మొగలప్ప, రాఘవేంద్ర, కోశాధికారిగా కల్పన గౌడ్, కార్యవర్గ సభ్యులుగా ఉమాకాంత్, మల్లేష్, అంజి, రవి, సీను, భీమ్ రాజ్, ఉష్ణ, అన్వేష్, సత్యనారాయణ, సతీష్, చంద్రశేఖర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురామయ్య గౌడ్ ఆధ్వర్యంలో లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, పట్టణ అధ్యక్షులు పోషణ వినోద్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

నారాయణపేట: వాహనదారులు ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని.. ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఏఎస్ఐ ఆంజనేయులు సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం నారాయణపేట పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టి రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ప్రజలు, వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్ తప్పకుండా ఉపయోగించాలని, కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు.

బ్లాక్ బెల్ట్ సాధించిన క్రీడాకారులు

కోస్గి రూరల్: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలో మండలానికి చెందిన అభిరాంనాయక్, శివకుమార్, వరుణ్, నైతిక్ నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపి బ్లాక్ బెల్ట్ సాధించినట్లు మాస్టర్ వెంకటయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ తైక్వాండో గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లోని పవర్‌హౌస్‌లో కొరియన్ బ్లాక్ బెల్ట్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి బ్లాక్ బెల్ట్ సొంతం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు గ్రాండ్ మాస్టర్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దూరు: మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు. పర్సపూర్ గ్రామానికి చెందిన కొరవొని సురేష్ తెల్లవారుజామున నాగిరెడ్డిపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి డ్రైవర్ నరేష్‌పై, యజమాని సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు



దర్శనం అనంతరం పర్ణికారెడ్డి దంపతులు

నారాయణపేట: తిరుమల తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామిని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి భర్త డా విశ్వజిత్ రెడ్డితో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం వీఐపీ విరామ దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని ప్రార్థించినట్లు తెలిపారు. అలాగే కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని, మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడాలని శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మద్దూరు: మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 ఏళ్ల తర్వాత విద్యార్థులందరూ కలుసుకొని కష్టసుఖాలను పంచుకున్నారు. అలాగే ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు చెప్పిన వేణుగోపాల్, బాలాజీ, భాను ప్రకాశ్, లాజర్, లింగప్ప, దానప్ప ఉపాధ్యాయులకు పూలమాల, శాలువాతో సన్మానించా రు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు లింగారెడ్డి, మహిపాల్, గణేష్, గంగప్ప, మౌలాలి, గోవిందు, పండరి,ఆశోక్, అనిల్, శ్వేత, మమత, కవిత, అపర్ణ, సల్మాబేగం, నవిత, జ్యోతి, జగదీశ్వరీ, ఉమాదేవి పాల్గొన్నారు.

34 ఏళ్ల తర్వాత ..



వైదిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు..

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని వైదిక ఉన్నత పాఠశాల 1990–91లో టెన్త్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కలుసుకుని ఒకరిబాగోగులు ఒకరు తెలుసుకున్నారు. దాదాపు 34 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో సాధించిన విజయాలు, కుటుంబస్థితిగతులు తెలుసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం తమ గురువులను ఘనంగా సన్మానించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుగ్గప్ప, బాల్ రెడ్డి, ఉమాశంకర్, బి వెంకట రాములు, దేవేందర్, నర్సింగరావు, గంగాధర్ రెడ్డి, సరోజనమ్మ, సుజాత, పూర్వ విద్యార్థులు విజయసాగర్, రఘురామయ్యగౌడ్, ప్రభాకర్, నాగార్జున రెడ్డి, ఉదయ భాస్కర్, లక్ష్మీకాంత్, సతీష్ గౌడ్, బండి రాజేశ్వరి, ముక్తాదేవి, విజయలక్ష్మి, తేజస్విని పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని దయానంద్ విద్యా మందిర్‌లో 1993–94లో చదువుకున్న పూర్వ విద్యార్థులు కూడా ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా తమ తమ ఉద్యోగ వివరాలు, వివాహం తదితర విషయాలను తెలుసుకొని సంతోషంగా గడిపారు. అనంతరం తమ గురువులను పూలమాల శాలువాలతో ఘనంగా సత్కరించారు.

అపూర్వ కలయిక

మరికల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. అలాగే తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్‌తోనే సంపూర్ణ అభివృద్ధి

నారాయణపేట రూరల్: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో పాల్గొని గ్రామ యువజన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ యువజన కమిటీ అధ్యక్షుడిగా తిమ్మారెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా తమప్ప నరేష్ శివానంద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లు అధికారంలో ఉండి బీఆర్ఎస్ చేయలేని అభివృద్ధిని 18 నెలల కాలంలో కాంగ్రెస్ చేసిందన్నారు. పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు అందించి వారి సొంతింటి కలను నెరవేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, హనుమంతు, మొనప్ప, చంద్రప్ప, శివప్ప, గంగప్ప, రాజేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

‘స్థానిక సంస్థల్లో సత్తా చాటుదాం’

కొత్తపల్లి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదామని యాదవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు హన్మంతు యాదవ్ తెలిపారు. ఆల్ ఇండియా యాదవ హక్కుల పోరాట సమితి నూతన మండల కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. మండల యాదవ కమిటీ అధ్యక్షుడిగా ఆంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవుల సత్తా ఏంటో చూపించాలన్నారు.

నేడు రైతులతో సీఎం వీడియో కాన్ఫరెన్స్

మాగనూర్: మండలంలోని మాగనూర్, వడ్వాట్, వర్కూర్ గ్రామాల్లోని రైతు వేదికలలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ప్రారంభోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల వ్యవసాయ అధికారి సుదర్శన్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా వీడియో కాన్ఫరెన్స్ యూనిట్లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ యూనిట్ల ద్వారా ప్రతి మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులతో రైతులకు ప్రత్యక్ష సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుందన్నారు. ఇందులో పంటల యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతికతలు, పంటలలో వచ్చే చీడ పీడల సమస్యల పరిష్కారానికి సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

‘రైతు నేస్తం’ కార్యక్రమం

నర్వ: మండలంలోని నర్వ, పెద్దకడ్మూర్ రైతు వేదికలో సోమవారం రైతు నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఓ అఖిలారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పెద్దకడ్మూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ అనుసంధాన ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం 4 గంటలకు సీఎం రైతులతో ముఖాముఖీ నిర్వహించనున్నారన్నారు. రైతులు, పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



విద్యార్థినిని అభినందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: క్రీడల్లో జిల్లాకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు తీసుకొని రావాలని వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటయ్య అన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ హకీంపేటలో పదో తరగతి చదువుతున్న నారాయణపేటకు చెందిన విద్యాశ్రీ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి రోయింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించింది. దీంతో ఆదివారం ఆమెను శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని, నిత్యం గంట పాటు ఆటలు ఆడటానికి సమయం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మహేష్ , బీజేపీ సీనియర్ నాయకులు ఆశప్ప, చందు సింగ్, సురేందర్, గోపి, ఆసీమ్, పీడీ కతలప్ప, పాల్గొన్నారు.